

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 | సంచిక : 163 | Vol : 18 | Issue : 163

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, మంగళవారం 25 ఆగస్టు 2026
Warangal, Tuesday 25 August 2026

పేజీలు : 08 | వెల రూ : 4-00

Pages : 08 | Price : 4-00

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



WANTED

పీపుల్స్‌డైరీ

దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను


సెంటర్లు

◆ హనుమకొండ ◆ కరీంనగర్ ◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం ◆ జనగామ ◆ మహబూబాబాద్ ◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859

www.epaper.peoplesdairynews.com

www.peoplesdairynews.com

# ధరల దరువు!

## సామాన్యుడి నెలవారీ బడ్జెట్‌పై భారం

విలవిలలాడుతున్న పేద కుటుంబాలు

బియ్యం మొదలు కూరగాయలు, నిత్యావసర ధరలు భగ్గు

ఉల్లి ఘాటు... చేదెక్కిన చక్కెర...

ధరలను నియంత్రించాలని డిమాండ్లు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యులకు పెరిగిన ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వంటింటి నిత్యావసరాల ధరలు వినియోగదారులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. బియ్యం నుంచి కూరగాయలు, చక్కెర, బెల్లం వరకు ప్రతి వస్తువు ధరలు గణనీయంగా పెరిగి మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. మేలు రకం సన్నబియ్యం ధరలు రెండు నెలల క్రితం కిలో రూ.50-52 ఉండగా ప్రస్తుతం రూ.63-70కి చేరుకున్నాయి. నాణ్యత కూడా తగ్గుతోందని వ్యాపారులు చెబుతున్నారు. వానాకాలం పంట బియ్యంతో యాసంగి పంటను కలపడం వల్ల నూకలశాతం పెరుగుతోంది. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా ఒత్తిడి ధరల పెరుగుదలకు

(మిగతా 2లో...)

# తెలంగాణపై ఇంత వివక్షా?



అమెరికా పర్యటన అడ్డుకున్నారు... కానీ నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

గుజరాత్ సీఎంకు అనుమతిచ్చి... నాకెందకు నిరాకరణ..

ఇది మన రాష్ట్రానికి జరిగిన అవమానమే

మోడీ గుజరాత్‌కు సీఎంగానే వ్యవహరిస్తున్నారు..

సీఏం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తన పర్యటనను అడ్డుకున్నా.. తన లక్ష్యాన్ని మాత్రం అడ్డుకోలేరని తేల్చి చెప్పారు. బ్రిటన్ పర్యట నకు అనుమతి ఇచ్చి.. అమెరికాకు ఎందుకు అనుమతి ఇవ్వ లేదని విమర్శించారు. గుజరాత్ సీఎంకు అనుమ తిచ్చి.. తెలంగాణ సీఎంకు అనుమతి ఇవ్వరా అని ప్రశ్నించారు. ఇది స్పష్టంగా ప్రధాని మోదీ తెలం గాణపై చూపిస్తున్న వివక్ష అని తీవ్రంగా మండిప డ్డారు.

ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను అడ్డుకోవడం అంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి, పెట్టుబడుల కోసం వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడం అంటే ఇది స్పష్టంగా తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష అని అర్థమవుతోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లోక్‌సభ, రాజ్యసభల్లో తమ పార్టీ సభ్యులు ప్రస్తావిస్తారని తేల్చి చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు మాత్రం అమెరికాలో పర్యటించేందుకు అనుమతిం చారని.. కానీ తనకు మాత్రం అనుమతి నిరాకరించారని ఆరోపించారు. నరేంద్ర మోదీ దేశానికి ప్రధానమంత్రిగా కాకుండా గుజరాత్ వ్యక్తిగా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తాను అమెరికాలో పర్యటిస్తే తెలంగాణకు (మిగతా 2లో...)

# వంద టన్నుల చికెన్ వ్యర్థాలు సీజ్

- చేపలకు ఆహారం కోసం తరలిస్తున్న వైనం
- ఏపీకి తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్‌లో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా వ్యవహారం మరోసారి తీవ్ర కలకలం రేపింది. నగరంలో ఉన్న కోళ్ల దుకాణాలు, చికెన్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి భారీ మొత్తంలో చికెన్ వ్యర్థాలను సేకరించి.. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న చేపల చెరువులకు తరలిస్తున్న ముఠాపై సైబరాబాద్ పోలీసులు, పశువైద్య శాఖ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టి.. దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దాదాపు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను అధికారులు పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. అధికారులు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కోళ్ల దుకాణాలు, మాంసం ప్రాసెసింగ్ కేంద్రాల నుంచి వెలువడే చికెన్ వ్యర్థాలను కొందరు

(మిగతా 2లో...)



# భక్తులపై వసూళ్ల వేట

## అన్నారం షరీఫ్ దర్గాలో దోపిడీ

- మొక్కులపై ముక్కుపిండి వసూలు...
- మత సామరస్యానికి ప్రసిద్ధి గాంచిన అన్నారంలో అక్రమాలు
- కందూర్, తలనీలాలు, వాహనపూజ, కాళ్లు తలకాయ, మటన్ అప్పగింతకు సెప'రేటు'
- శుక్రవారం, ఆదివారం ఘనంగా పూజలు
- అదును చూసుకుని అక్రమ దోపిడీకి పాల్పడుతున్న దళారులు
- గుత్తేదారుదే ఇష్టారాజ్యంగా దోపిడీ
- కాంట్రాక్టర్‌తో సహా వక్ఫ్ బోర్డు అధికారుల చేతివాటం?

మతం వేరైనా మొక్కు ఒక్కటే... ప్రార్థన వేరైనా ఆశ ఒక్కటే... తన బాధలు తీరాలి, తన కుటుంబం బాగుండాలి. అలాంటి పవిత్ర స్థలంలో భక్తుడి నమ్మకమే వ్యాపారమైతే, మొక్కే ముడుపైతే, దైవ సన్నిధే దోపిడీ కేంద్రంగా మారితే భక్తుల గోడు పట్టించుకునేదెవరు?

అన్నారం షరీఫ్ అడుగుతోంది... "నా గడపకు వచ్చిన భక్తుడిని ఆశీర్వదించాలా... అమ్ముకోవాలా?"

పవిత్రతను కాపాడండి, అక్రమాలకు అడ్డుకట్ట వేయండి, దళారుల పెత్తనాన్ని తొలగించండి, దర్గా ఆదాయాన్ని దర్గా అభివృద్ధికే వినియోగించండి.

భక్తుడి కన్నీటికి ధర వద్దు, మొక్కుకు రేటు వద్దు, దైవ విశ్వాసానికి దోపిడీ వద్దు. మత సామరస్యానికి నిలువెత్తు సాక్ష్యమైన అన్నారం షరీఫ్ దర్గా మళ్లీ భక్తి గుడారంగా వెలగాలి... దోపిడీ చీకట్లు తొలగాలి... నమ్మకం గెలవాలి!

పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్

2లో



# కేబినేట్ ప్రక్షాళనకు వేళాయే..

## ముహూర్తం ఖరారు...? మొదలైన కసరత్తు

## కొందరు ఔట్... మరికొందరి శాఖల మార్పు

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేంద్ర కేబినెట్ ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైన ప్రధాని మోడీ.. వివిధ కారణాలతో దాన్ని కాస్త వాయిదా వేసుకున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా జాతీయ స్థాయిలో ఒక్కసారిగా పెనుమార్పులు సంభవించాయి. అదే సమయంలో వీటి ప్రభావం త్వరలో జరిగే మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై పడేలా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముందుగా బీజేపీ జాతీయ కార్యవర్గంలో మార్పులు చేర్పులు చేసిన మోడీ.. ఇప్పుడు తన కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ముహూర్తం కూడా ఖరారైనట్లు తెలుస్తోంది.


దేశంలో మారిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతల్ని మార్చుకోవడంతో పాటు తిరిగి జనంలో విశ్వాసం పెంచుకోవడానికి ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. ముఖ్యంగా రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా కేబినెట్లో మార్పులు చేసుకోవాలని మోడీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈసారి కేబినెట్ మార్పులు కచ్చితంగా జాతీయ స్థాయిలో కీలక సంకేతాలు ఇచ్చే విధంగా ఉంటాయని చెప్తున్నారు. ఇప్పటికే కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధం చేసుకున్న ప్రధాని మోడీ.. అందులో భాగంగానే ఇద్దరు మంత్రులకు రాజ్యసభ కొనసాగింపు ఇవ్వలేదు, అలాగే మరో ముగ్గురిని ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఇన్ ఛార్జ్ లుగా పంపారు.

ఇప్పుడు కేబినెట్లో మిగిలిన మంత్రుల్లోనూ పలువురికి ఉద్వాసన పలికేందుకు సిద్ధమవుతున్నట్లు (మిగతా 2లో...)

# రామగుండంలో ఉగ్రలింకులు

- యువకుడి ఇంట్లో ఎన్ఐఏ తనిఖీలు
- అదుపులో ఇంజినీరింగ్ విద్యార్థి?

పీపుల్స్‌డైరీ-రామగుండం : ఉగ్ర లింకులపై ఎన్ఐఏ ఎప్పటికప్పుడు డేగ కన్నేసే ఉంటుంది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలోని రామగుం డంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్‌లో ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించింది. రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్‌ను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. (మిగతా 2లో...)



# కాజీరంగాలో గోల్డెన్ టైగర్

జన్యు వైవిధ్యపు అద్భుతం..

ఈ ప్రత్యేక రంగు వెనుక కారణం అదే

వన్యప్రాణి ప్రేమికుల్లో ఆసక్తి...

2వ పేజీలో..



పీపుల్స్‌డైరీ
వరంగల్
మంగళవారం, 25 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 163


# భక్తులపై వసూళ్ల వేట!

## అన్నారం షరీఫ్ దర్గాలో అక్రమ దోపిడీ

- మొక్కులపై ముక్కుపిండి వసూలు...
- అడుగడుగునా ముట్టజెప్పాల్సిందే....
- మత సామరస్యానికి ప్రసిద్ధి గాంచిన అన్నారంలో అక్రమాలు
- భక్తుల కోర్కెలు నెరవేరితే కందూర్‌తో మొక్కులు
- కందూర్, తలనీలాలు, వాహనపూజ, కాళ్లు తలకాయ, మటన్ అప్పగింతకు సెప'రేటు'
- శుక్రవారం, ఆదివారం ఘనంగా పూజా కార్యక్రమాలు
- అదును చూసుకుని అక్రమ దోపిడీకి పాల్పడుతున్న దళారులు
- గుత్తేదారుదే ఇష్టారాజ్యంగా అన్నారంలో దోపిడీ
- కాంట్రాక్టర్‌తో సహా వక్ఫ్ బోర్డు అధికారుల చేతివాటం?






**పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ యాకుబ్ షావలి దర్గా ప్రసిద్ధిగాంచిన ప్రధాన దర్గా ఇది. మత సామరస్యానికి ప్రతీకగా నిలచిన ఆలయంలో అక్రమ దోపిడీకి అంతులేకుండా పోయింది. దర్శనం నుండి మొదలు తలనీలాలు, వాహన పూజ, కందూర్ మొక్కు చెల్లించటం, కందూర్ చేయాలంటే టికెట్, మటన్ కోయాలంటే టికెట్, ఇక తల, కాళ్లు, మటన్ భగవంతునికి సమర్పిస్తే వాటికి వెయ్యి నుండి 2 వేల వరకు విక్రయించటం, ఒక్కో వాహన పూజకు ఒక్కో రేటుతో అక్రమ దోపిడీకి పాల్పడుతున్నారు. పల్సర్‌కి ఓ రేటైతే ప్లేజర్‌కు ఓ రేటు... కారుకు మరోటి నిర్ణయించి భక్తులవద్ద అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంట దిగుబడి రావాలని రైతులు, సంతానం కావాలని కొత్త జంట, పెండ్లి కావాలని, మంచి ఉద్యోగం... ఉన్నత స్థానాలకు ఎదగాలని, వ్యాపారం సాఫీగా కొనసాగాలని ఇలా ఒక్కొక్కరు ఒక్కో విధంగా మొక్కుకుని మొక్కు తీరాక దర్గాలో మొక్కులు చెల్లిస్తుంటారు. ఇక మొక్కు తీరి తీరా దర్గాకు వెళ్లి మొక్కు చెల్లిస్తామనుకుంటే జేబుకు చిల్లు పడుతుందని భక్తులు భయాందోళనకు గురతువున్నారు. ఇక ఈ తతంగం అంతా కూడా షరీఫ్‌లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో నడుస్తుందని, కాంట్రాక్టు పద్ధతిలో సంవత్సరానికి కోటిన్నరతో గుత్తేదారుకు అంటగట్టి ఇక్కడ కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారని ప్రచారం సాగుతుంది. గతంలో వక్ఫ్ బోర్డు అధికారులే కాంట్రాక్టర్లుగా ఉంటూ కోట్ల రూపాయలు దర్గా ఆదాయాన్ని కొల్లగొట్టినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం కాంట్రాక్ట్ సమయం పూర్తయ్యేందుకు ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులకు కేటాయించారని తెల్సింది. కోట్ల రూపాయల టెండర్ పారదర్శకంగా కాకుండా కావలసిన వ్యక్తులకు కేటాయించి ఆ మొత్తాన్ని దర్గా అభివృద్ధికి కాకుండా సొంతానికి వాడుతున్నట్టు బాహాటంగానే ప్రచారం సాగుతుంది. వక్ఫ్ బోర్డు అధికారులు సైతం చూసి చూడనట్టు వ్యవహరించటం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొక్కులు చెల్లించటానికి భక్తులు ప్రతీ శుక్రవారం, ఆదివారం సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున భక్తులు దర్గాను సందర్శించి మొక్కులు చెల్లించే క్రమంలో ఇలాంటి అక్రమ దోపిడీ నివారించాలని భక్తులు వేడుకుంటున్నారు. రద్దీ సమయంలో వక్ఫ్ బోర్డు సిబ్బంది విధుల్లో లేకపోవటం, అధికారులు సైతం పట్టించుకోకపోవటం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా కానవస్తుంది. ఇప్పటికైనా అక్రమ దోపిడీని అరికట్టి దర్గా అభివృద్ధికి తోడ్పడుతూ అక్రమాలు జరుపుతున్న దళారులపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్ బోర్డు అధికారులను భక్తులు కోరుతున్నారు.





# తెలంగాణపై ఇంత వివక్షా?

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు వస్తాయని.. విద్య, క్రీడా రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించి.. తన పర్యటనను రద్దు చేశారని ఆరోపించారు. అదే సమయంలో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు, విదేశీ సంస్థల భాగస్వామ్యం గుజరాత్‌కు తరలించుకుపోయేందుకే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు అనుమతించారని మండిపడ్డారు.

తన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించిన సీఎం రేవంత్ రెడ్డి.. కానీ తన లక్ష్యాలైన తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ రైజింగ్ 2047ను మాత్రం అడ్డుకోలేరని తేల్చి చెప్పారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించి.. తెలంగాణను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనేదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. తెలంగాణకు పెట్టుబడులను సాధించుకువచ్చేందుకే విదేశీ పర్యటన రూపొందించామని.. అయితే దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని.. దాన్ని మోదీ ప్రభుత్వం చెడగొడుతోందని మండిపడ్డారు.

అమెరికా పర్యటనలో ప్రపంచంలోనే ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పామని.. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్రం తమకు బదులిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ ముఖ్యమంత్రికి మాత్రం అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారని పేర్కొన్నారు. తన పర్యటనను అడ్డుకోవడం అంటే అది రేవంత్ రెడ్డికి జరిగిన అవమానం కాదని.. 4 కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని తేల్చి చెప్పారు.

# ధరల దరువు....

(మొదటి పేజీ తరువాయి)

కారణాలుగా మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పౌరసరఫరాల సంస్థ వద్ద అధిక స్టాక్ ఉన్నా వేలం ప్రక్రియకు స్పందన లేకపోవడం మరో కారణంగా తెలుస్తుంది.

ఇక ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జూలై చివరి వారంలో కిలో రూ.22–26 ఉంటే ఇప్పుడు రూ.45–52కి చేరింది. వెల్లుల్లి ధర జూన్ మొదటి వారంతో పోలిస్తే రూ.120–130 నుంచి రూ.250 వరకు దాదాపు 100శాతం పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి, కార్పొరేట్ స్టోర్లలో రూ.360 వరకు పలుకుతోంది. కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. క్యారెట్ రూ.60–70, బీన్స్ రూ.100–110, చిక్కుడు రూ.80, మోరంగడ్డ రూ.25–33 నుంచి రూ.60కి, పచ్చిమిర్చి రూ.45–55కి చేరాయి. వంట నూనెలు కిలోకు రూ.4–5 పెరిగాయి.చక్కెర ధర ఆరేడు వారాల్లో రూ.42–44 నుంచి రూ.60–65కి సుమారు 50 శాతం, బెల్లం రూ.55 నుంచి రూ.70–75కి పెరిగింది. పండగలు, శుభకార్యాలు, బోనాలు నేపథ్యంలో పూల ధరలు మూరకు రూ.20–25 నుంచి రూ.50–60 వరకు పెరిగి అదనపు భారం మోపుతున్నాయి. ఈ ధరల పెరుగుదలతో ఇంటి నిత్యావసరాల ఖర్చు భరించలేని స్థితికి వినియోగదారులు చేరుకుంటున్నారు. ధరలను నియంత్రించాలని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సామాన్య , మధ్యతరగతి ప్రజలు కోరుతున్నారు.

# కేబినెట్ ప్రక్షాళనకు వేళాయే...

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. అలాగే మరికొందరు శాఖల మార్పు తప్పనిసరి అవుతోంది. ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్. ఆమెను వేరే శాఖకు పంపి, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ను ఆర్థికమంత్రిగా నియమించే అవకాశముంది. అలాగే రెగ్యులర్ విద్యాశాఖ మంత్రిని కూడా నియమించే అవకాశం ఉంది. అలాగే పలు కీలక శాఖల్లోనూ మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఇలా చూస్తే మొత్తం మీద 20 మంది మంత్రుల వరకూ వేటు లేదా శాఖల మార్పు ముప్పు ఎదుర్కుంటున్నట్లు ఢిల్లీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఇందులో భాగంగా పలువురు జూనియర్ మంత్రులపై వేటు పడొచ్చని చెప్తున్నారు. లేదా వేరే శాఖలకూ పంపే అవకాశం ఉంది. అలాగే ఎన్నికలు జరిగే యూపీ, గుజరాత్, పంజాబ్ నుంచి కొత్త మంత్రులు కేబినెట్లోకి రాబోతున్నారు.

# రామగుండంలో ఉగ్ర లింకులు?

(మొదటి పేజీ తరువాయి)

ముజామిల్ ఖాన్‌కు ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముజామిల్‌ను ఎన్‌టీపీసీ పోలీస్ స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాద సంస్థలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

ఇదే పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో 2023లో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు చేపట్టి ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు రామగుండంలో ఒక ఇంజినీరింగ్ విద్యార్థిని విచారిస్తున్నారు. ఉగ్రవాదాన్ని దేశంలో ప్రేరేపిస్తున్నారన్న అనుమానం వచ్చినా ఎన్ఐఏ డేగ కన్నుతో వారి స్థావరాలను గుర్తించి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తోంది.

2023లో పెద్దపల్లి జిల్లా గోదావరి ఖనిలో చేపట్టిన తనిఖీల్లో వారికి ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖొరాసన ప్రావిన్స్‌తో లింకులు ఉన్నట్లు అనుమానించారు. పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్లతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆరోపణలు రావడంతో అప్పట్లో తనిఖీలు నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు తాజాగా ఇంజినీరింగ్ విద్యార్థిపై అనుమానం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు.



# వంద టన్నుల చికెన్ వ్యర్థాలు సీజ్

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తులు సేకరిస్తున్నారు. ఆ తర్వాత వాటిని లారీల్లో నింపి.. ఆంధ్రప్రదేశ్‌కు తరలించి.. అక్కడ చేపల చెరువుల యజమానులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. చేపలకు మేతగా ఉపయోగించేందుకు ఈ చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాకు సంబంధించి.. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సైబరాబాద్ పోలీసులు, వెటర్నరీ అధికారులు నగరంలోని అత్తాపూర్, మియాపూర్, అమీన్‌పూర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చింతల్ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లారీల్లో తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను గుర్తించి సీజ్ చేసుకున్నారు. భారీ మొత్తంలో వ్యర్థాలు పట్టుబడటంతో ఈ అక్రమ రవాణా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.'

అయితే ఈ చికెన్ వ్యర్థాలను ప్రధానంగా రాత్రి వేళల్లో ఏపీకి తరలించి.. అక్కడి చేపల చెరువు యజమానులకు అమ్ముతున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. గతంలోనూ ఇలాంటి వ్యవహారంపై కేసులు నమోదైనప్పటికీ.. ఇంకా ఈ చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత నెలలోనూ సుమారు 100 టన్నుల చికెన్ వ్యర్థాలను అధికారులు స్వాధీనం చేసుకోగా.. తాజాగా మరోసారి అంతే ఎత్తున సీజ్ చేయడం గమనార్హం.

చికెన్ వ్యర్థాలను చేపలకు మేతగా ఉపయోగించడం వల్ల ఆహార భద్రత, ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు తీవ్ర హెచ్చరికలు చేశారు. అపరిశుభ్రమైన వ్యర్థాలను తిని పెరిగిన చేపలను.. ప్రజలు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. చికెన్ వ్యర్థాలను అక్రమంగా సేకరించి, రవాణా చేసి, చేపల చెరువులకు విక్రయిస్తున్న నెట్‌వర్క్‌పై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# కాజీరంగాలో గోల్డెన్ టైగర్

**జన్యు వైవిధ్యపు అద్భుతం..**
**ఈ ప్రత్యేక రంగు వెనుక కారణం అదే**
**వన్యప్రాణి ప్రేమికుల్లో ఆసక్తి...**

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : భారతదేశంలోని వన్యప్రాణి సంపద మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అసోంలోని కాజీరంగా జాతీయ పార్కులో అరుదైన బంగారు పులి కనిపించడం వన్యప్రాణి ప్రేమికుల్లో ఆసక్తిని పెంచింది. ఈ పార్కులో గతంలోనూ ఇలాంటి పులులు కనిపించినప్పటికీ, తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ దర్శనం సోషల్ మీడియాలోనూ, సంరక్షణ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. బంగారు రంగులో మెరిసే ఈ పులి చూడటానికి సాధారణ బెంగాల్ పులికి భిన్నంగా కనిపించినప్పటికీ, ఇది ప్రత్యేకమైన పులి జాతి లేదా ఉపజాతి కాదు. బెంగాల్ పులుల్లో కనిపించే అరుదైన జన్యు రంగు వైవిధ్యం మాత్రమే. బంగారు పులిని సాధారణంగా గోల్డెన్ ట్యాబీ టైగర్, గోల్డెన్ టైగర్ లేదా స్ట్రాబెర్రీ టైగర్ అని కూడా పిలుస్తారు. వీటి శరీరంపై లేత బంగారు లేదా క్రీమ్–పసుపు రంగు బొచ్చు ఉండగా, సాధారణ పులుల్లో కనిపించే నల్లటి చారలకు బదులుగా ఎరుపు–గోధుమ రంగు చారలు కనిపిస్తాయి. ఈ ప్రత్యేకమైన రంగు వెనుక 'వైడ్‌బ్యాండ్' జన్యు వైవిధ్యం కీలక పాత్ర పోషిస్తుంది. వెంట్రుకల పెరుగుదల సమయంలో ఈ జన్యు వైవిధ్యం మెలనిన్ వంటి వర్ణద్రవ్యాల వ్యక్తీకరణను ప్రభావితం చేయడం వల్ల పులి వెంట్రుకలు సాధారణ నారింజ రంగు కంటే లేతగా, బంగారు వర్ణంలో కనిపిస్తుంది.

బంగారు పులులను ప్రత్యేకమైన పులి జాతిగా భావించడం సరైంది కాదు. ఇవి జన్యుపరంగా బెంగాల్ పులులే. అయితే, రంగును ప్రభావితం చేసే జన్యు వైవిధ్యం కారణంగా వాటి రూపంలో స్పష్టమైన తేడా కనిపిస్తుంది. పరిశోధనల ప్రకారం, 'వైడ్‌బ్యాండ్' జన్యు వైవిధ్యం పులి బొచ్చు రంగు, చారల రూపాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది తెల్ల పులుల రంగుకు కారణమయ్యే జన్యువుతో ఒకటే కాదు. అందువల్ల బంగారు పులి, తెల్ల పులి రెండూ ఒకే విధమైన జన్యు మార్పు ఫలితాలు కావు.

ఎందుకు ఇంత అరుదు?

అడవుల్లో పులుల రంగులో సహజమైన జన్యు వైవిధ్యాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. అందుకే బంగారు పులిని అడవిలో చూడటం వన్యప్రాణి పరిశీలకులకు ప్రత్యేక అనుభవంగా మారుతుంది. కాజీరంగాలో కనిపించిన ఈ పులి కూడా బెంగాల్ పులుల్లో సహజంగా ఏర్పడిన ఇలాంటి అరుదైన రంగు వైవిధ్యానికి ఉదాహరణగా చెప్పవచ్చు.



# తల్లిదండ్రులను హత్యచేసిన సురేఖ విషాదాంతం...

- ప్రియుడి కోసం కన్నవారిని చంపి జైలుకెళ్లిన నర్సు సురేఖ..
- బెయిల్‌పై బయటకొచ్చి ఆత్మహత్య
- జనవరిలో తల్లిదండ్రులను హత్య చేసిన సురేఖ
- మత్తుమందుతోనే ఆత్మహత్యకు పాల్పడిన వైనం

పీపుల్స్‌డైరీ–సంగారెడ్డి : ప్రియుడి కోసం కన్న తల్లిదండ్రులకే మత్తు మందు ఇచ్చి హత్య చేసిన నర్సు సురేఖ కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆరు నెలల కిందట ఆమె చేసిన పని రెండు రాష్ట్రాల ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. అయితే, బెయిల్‌పై బయటకొచ్చిన ఆమె అదే మత్తుమందుతో బలవన్మరణానికి పాల్పడి ప్రాణాలు తీసుకుంది. సంగారెడ్డిలోని శాంతినగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఆదివారం ఆమె ఆత్మహత్యకు పాల్పడింది.

ఆత్మహత్య చేసుకునే ముందు సురేఖ సూసైడ్ నోటు రాసిందని పోలీసులు గుర్తించారు. "నా చావుకు ఎవరూ కారణం కాదు" అని రాసి ఉన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం సురేఖ మృతదేహాన్ని సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అయితే, కన్నవారిని దారుణంగా హత్య చేసిన సురేఖ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువులు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కుటుంబ సభ్యులు కూడా నిరాకరిస్తున్నారు.

గతంలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేసిన సురేఖ ఒక యువకుడిని ప్రేమించింది. తన ప్రేమ వివాహానికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో వారిని హత్య చేయాలని పథకం వేసింది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారం గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి ఒళ్లునొప్పులను మందు ఇస్తున్నానంటూ అధిక మోతాదులో మత్తు ఇంజెక్షన్ ఇచ్చి ఒకరి తర్వాత మరొకరిని ఆమె హత్యచేసింది. ఈ ఏడాది జనవరిలో ఘటన చోటుచేసుకోగా.. ఇటీవల ఆమె బెయిల్‌పై బయటకు వచ్చింది. అయితే, బయట ఎలాంటి ఉద్యోగం దొరక్క, తీవ్ర మనస్తాపంతోనే సురేఖ ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసే సురేఖ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన ఓ డ్రైవర్‌తో ప్రేమలో పడింది. అతనితో వివాహానికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరించింది. కానీ, పోలీసుల విచారణలో అసలు విషయం వెల్లడవడంతో జనవరిలో జైలుకు వెళ్లింది. ఇటీవల బెయిల?పై బయటకు వచ్చిన సురేఖ తల్లిదండ్రులకు ఇచ్చిన మత్తుమందుతోనే తానూ ప్రాణాలు తీసుకుంది.

# సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందనలు



**భూపాలపల్లి ఆగస్టు 24 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎస్పీ, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన కార్యవర్గం పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు శాఖలో ఐక్యత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అసోసియేషన్ చేపట్టే కార్యక్రమాలకు జిల్లా పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు.

### నూతన కార్యవర్గం

అధ్యక్షులు: గూగులోతు నరేష్, ఎస్‌బీ కానిస్టేబుల్, భూపాలపల్లి. ఉపాధ్యక్షులు:ఎన్. వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్, మహాదేవపూర్.ఎస్. సాంబమూర్తి, ఎస్ఐ, మహాదేవపూర్. కార్యదర్శి: బి. అశోక్, ఎస్ఐ, ఘనపూర్.జాయింట్ సెక్రటరీ: ఎ. రమేష్, పీసీ, మహాముత్తారం పోలీస్ స్టేషన్ .ఆర్గనైజింగ్ సెక్రటరీ: ఏ. సతీష్, పీసీ, ఘనపూర్ పోలీస్ స్టేషన్. కోశాధికారి: ఓ. చిన్నన్న, కానిస్టేబుల్, పీసీఆర్, భూపాలపల్లి.

### కార్యవర్గ సభ్యులు:

బి. సతీష్, భూపాలపల్లి పోలీస్ స్టేషన్.డి. శ్రావణ్, పీసీ, పలిమెల పోలీస్ స్టేషన్.పి. విజయ్, పీసీ, మొగుళ్లపల్లి.ఎం. అంబిక, పీసీ, మహాముత్తారం పోలీస్ స్టేషన్.ఎం. యాదిరెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, భూపాలపల్లి.క్రాంతి, ఏఆర్ పీసీ, భూపాలపల్లి.నూతన కార్యవర్గం పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆకాంక్షించారు.

# కొండెక్కిన నిత్యావసర వస్తువుల ధరలు.. మోడీ సర్కార్ వైఫల్యం

- ఆహార ద్రవ్యోల్బణం సామాన్యులను భయపెడుతోంది
- కోతుల బెడదను అరికట్టాలి.. ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్




**సింగరేణి,(కారేపల్లి) ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ):** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయని, ముఖ్యంగా వంట నూనెలు, చక్కెర, బియ్యం, ఉప్పు, పప్పులు, కూరగాయల ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ ఆవేదన వ్యక్తం చేశారు.కారేపల్లి--కామేపల్లి సంయుక్త మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం టేకులగూడెంలో రంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు కూడా సామాన్యులపై ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయని అన్నారు. ధరల నియంత్రణలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు.ధరల నియంత్రణలో కేంద్రం విఫలం, ధరల పెరుగుదలకు పంటల దిగుబడి తగ్గుదల, ఎల్‌నినో వంటి కారణాలను కేంద్ర ప్రభుత్వం సాకుగా చూపుతోందని నాయకులు విమర్శించారు. మరోవైపు కార్పొరేట్ సంస్థలు పెద్ద మొత్తంలో ధాన్యాలను నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ, వాటిపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల కొరత పేరుతో విదేశాల నుంచి సుంకాలు లేకుండా దిగుమతులకు అవకాశాలు కల్పిస్తున్న ప్పటికీ, ఆ సరుకు కూడా చివరకు కార్పొరేట్ సంస్థల గోదాములకే చేరుతున్న పరిస్థితి ఉందని వారు ఆరోపించారు. సామాన్యులపై ఆర్థిక భారాన్ని తగ్గించేం దుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలో కోతుల బెడద తీవ్రంగా పెరిగిందని, పంటలను నాశనం చేయడంతో పాటు ఇళ్లలోకి చొరబడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తు న్నాయని ఆవుల అశోక్ ఆందోళన వ్యక్తం చేశారు. కోతుల నియంత్రణకు అటవీ, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే ఇందిరమ్మ ఇళ్లను నిర్ణీత సమయంలో పూర్తి చేసిన పేదలకు ఫైనల్ బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. పూర్తయిన ఇళ్లకు సంబంధించిన ఫైనల్ బిల్లులను వెంటనే విడుదల చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు గుగులోత్ తేజా నాయక్, మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి రాకేష్, భాస్కరరావు, అనుసూర్య, సరోజినీ, పుల్లకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# 16 ఏళ్ల లోపు పిల్లలకు సామాజిక మాధ్యమాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి గారిని దయతో కోరుతూ
- సెప్టెంబర్ మాసంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాల్య వివాహల నిర్మూల కోసం అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు
- వలస సుభాష్ చంద్రబోస్ రాష్ట్ర అధ్యక్షులు బాలల హక్కుల ప్రజా వేదిక



**సైదాపూర్ ఆగస్టు 24( పీపుల్స్ డైరీ ) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకులు, బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ విలేకరులకు ప్రకటన విడుదల చేసి వారు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాలల హక్కుల కోసం బాల్య వివాహ నిర్మాణ కోసం గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు వచ్చే సెప్టెంబర్ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాల్యవివాహల నిర్మూలన బాలల హక్కులు తెలిపేందుకు ప్రజలకు విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్నారి బాలబాలికల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి దయతో కోరుతూ 16 ఏళ్ల లోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల వినియోగంపై నిషేధం విధించాలని ఆయన కోరారు ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో నల్లగొండ మరికొన్ని సంఘటనలు చూస్తా ఉంటే ఎంతో బాధగా అయితుందని ఆయన పేర్కొన్నారు స్మార్ట్‌ఫోన్ నేటి తరం పిల్లలు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆందోళన చెందారు రాష్ట్రంలో కొంతమంది చిన్నారి విద్యార్థులు మద్యం, సిగరెట్ వంటి అలవాట్లకు బానిస కావడం గంజాయి, డ్రగ్స్ వంటి ప్రాణాంతక మత్తు పదార్థాల ఉచ్చులో పడటం ఇంటర్నెట్ ప్రభావంతో అమ్మాయిలు పురుషులపై, అబ్బాయిలు స్త్రీలపై ద్వేషం పెంచుకోవడం విలాసాలకు అలవాటుపడి, సులభ మార్గాల్లో డబ్బు సంపాదించాలని వెంపర్లాడటం. మనుషుల పట్ల జాలి, దయ తగ్గిపోయి క్రూరత్వం హింసాత్మక ఆలోచనలు పెరగడం. చదువును పూర్తిగా పక్కన పెట్టేసి భవిష్యత్తును పాడు చేసుకోవడం కొంతమంది విద్యార్థులు తయారవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు చెడు సావాసాలతో సమాజానికి హానికరమైన శక్తులుగా మారడం బాధాకరమైన పేర్కొన్నారు

### రాత్రింబవళ్లు ఫోన్‌కు అతుక్కుపోయి నిద్రలేమి


తీవ్ర అనారోగ్యాల బారిన పడటం తల్లిదండ్రులు, పెద్దలు మంచి చెప్పినా వినకుండా ఎదురు తిరిగే మనస్తత్వం కలగడం ఇంతవరకు సమజసమని విద్యార్థులు తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు ఒక్క స్మార్ట్‌ఫోన్ పిల్లల చేతికి సరైన పర్యవేక్షణ లేకపోతే పై వాటిలో కనీసం రెండు మూడు సమస్యలైనా వారి జీవితాల్లోకి రావడం ఖాయం తల్లిదండ్రులారా గమనించండి పిల్లలు మితిమీరిన మొబైల్ వ్యసనంలో పడి దారితప్పితే చివరికి మీ కుటుంబ శాంతికి ఆస్తికి, భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు

### తల్లిదండ్రులు కు విజ్ఞప్తి

పిల్లల చేతికి ఫోన్ ఇచ్చి వదిలేయకుండా, వారి అలవాట్లు మరియు స్క్రీన్ సమయంపై కచ్చితమైన పర్యవేక్షణ ఉంచాలి ఉపాధ్యాయులు తరగతి గదుల్లో మొబైల్ వాడకాన్ని నియంత్రిస్తూ, విద్యార్థుల్లో నైతిక విలువలు మరియు క్రమశిక్షణను పెంపొందించాలి విద్యార్థి యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, హానికర డిజిటల్ కంటెంట్‌పై కఠిన చట్టాలు తేవాలి ఆయన ప్రభుత్వాన్ని కోరారు సాంకేతిక జ్ఞానాన్ని పెంచే సాధనం కావాలి కానీ, జీవితాన్ని నాశనం చేసే వ్యసనం కాకూడదు. రాష్ట్రంలో కొంతమంది విద్యార్థులు మారకద్రవ్యాలు వాడుతూ వాటికి బానిసై సమాజంలో చీడపురుగుల తయారవుతున్నారని ఆయన ఆందోళన చెందారు అలాంటి వారిపై కఠినంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించాలని మానవత విలువలు సనాత ధర్మం పెంచేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని వారు పేర్కొన్నారు అధిక సెల్ ఫోన్ వినియోగం వల్ల పిల్లల్లో కంటి చూపు ఏకాగ్రత లోపం, నిద్రలేమి, నిరుత్సాహం పెరుగుతున్నాయి. హింసాత్మక విషయాలు అపరిచితులతో పరిచయాలు సైబర్ వేధింపులు పిల్లల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి ఆయన అన్నారు అలాగే పిల్లల కోసం కర్ణాటక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇప్పటికే తీసుకున్న చర్యలు ఆదర్శమని ఆయన పేర్కొన్నారుతెలంగాణలో కూడా నేటి బాలలే రేపటి బావి భారత పౌరులు కాబట్టి పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర శాసనసభ సమావేశంలో చట్టం చేయాలని ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారికి బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర కమిటీ నుండి విజ్ఞప్తి చేస్తున్నాము ఆయన తెలిపారు.

# అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటాం: వొడితల ప్రణవ్

- జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి
- నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహార దీక్షలను విరమింపజేసిన ప్రణవ్
- ఇళ్ల పట్టాల సమస్యపై పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ



**హుజూరాబాద్, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ):** ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్దపీట వేస్తున్నామని, అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద కొనసాగుతున్న జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలను వొడితల ప్రణవ్ సందర్శించారు. అనంతరం దీక్ష చేస్తున్న జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహార దీక్షలను విరమింపజేశారు.ఈ సందర్భంగా ప్రణవ్ మా ట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల పట్టాలకు సంబంధించి ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ప్రక్రియను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, జర్నలిస్టుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.జర్నలిస్టులు సమాజ సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజూ రాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట లో గుర్తుతెలియని యాచకుడు మృతి



**జమ్మికుంట అగస్ట్ 24పీపుల్స్ డైరీ.** జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అలాగే వార్డు మెంబర్ నల్లగాశ హరీష్ జమ్మికుంట అంబులెన్స్ శేఖర్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే జమ్మికుంట అంబులెన్స్ శేఖర్ స్పందించి, తన అంబులెన్స్‌లో మృతదేహాన్ని జమ్మికుంట మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా సమాచారం అందిన వెంటనే స్పందించి మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు సహకరించిన అంబులెన్స్ శేఖర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# పెండింగ్ వర్కులు ఎప్పుడు మొదలుపెడతారో చెప్పండి



**కమలాపూర్ ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** కమలాపూర్ మండల సర్పంచుల కోరం అధ్యక్షులు కౌడగాని రాజేష్ కమలాపూర్ మండలానికి చెందిన 24 గ్రామాల కు సాంక్షన్ ఐ ఉన్నటువంటి రెండు కోట్ల 50 లక్షల సీసీ రోడ్ల వర్కులు పెండింగ్లో ఉన్నవి. ఈ సీసీ రోడ్ల వర్క్ పెండింగ్ ఉన్నవని వాటిని ఎప్పటి వరకు రిలీజ్ చేస్తారో చెప్పమని సర్పంచ్ల ఆధ్వర్యంలో డి ఆర్ డి ఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల్ సర్పంచ్ కోరం అధ్యక్షుడు కౌడగాని రాజేష్, కుమ్మరి కుమార్, రవీందర్ రావు, చేరాల్, కళ్యాణి, రాజు, ఓదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మృతిరాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వీణవంక ఆగస్టు 24( పీపుల్స్ డైరీ) :** కొండపాక గ్రామపంచాయతీలో సపాయిగా విధులు నిర్వహిస్తున్న కొలుగూరి సారయ్య తల్లి, కొలుగూరి మధునమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసి ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించిన గ్రామ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి అండగా నిలుస్తూ 5,000 రూపాయల నగదు 25 కిలోల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పురెళ్ల కుమార్ వార్డు సభ్యులు దాట్ల శ్రీనివాస్ పానుగంటి పోచయ్య కత్తి సురేష్ మీడిదొడ్డి మధు కోడిపల్లి తిరుపతి గ్రామ ఫీల్డ్ ఆఫీసర్ గోదా రఘు ఇదునూరి అరుణాచలం కోలుగూరి రాజేష్ పాల్గొని, మధునమ్మ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పట్టపగలే చైన్ స్నాచింగ్ యత్నం: తప్పిన ప్రమాదం!



**భూపాలపల్లి ఆగస్టు 24 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు లక్ష్మీనగర్‌లో పట్టపగలే చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. సోమవారం ఉదయం సుమారు 5:44 గంటల సమయంలో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన దంపతులను వెంబడించిన దుండగులు మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్ళే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. స్థానిక నివాసితులైన చింతకుంట్ల సాంబరెడ్డి, అహల్య దంపతులు వాకింగ్ చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ దుండగుడు మహిళను వెంబడించి క్షణాల్లోనే గొలుసు లాక్కునే క్రమంలో అది అతని చేతిలో కాకుండా మహిళా మెడలోనే పడిపోయింది, ఈ క్రమం లో వీధి చివర బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాల్లో నమోదైనట్లు తెలుస్తోంది.లక్ష్మీనగర్‌లో గత ఏడాది ఇదే నెలలో రాఖీ పౌర్ణమి సందర్భంగా ఓ ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటనను స్థానిక 22వ వార్డు కౌన్సిలర్ బుర్ర రమాదేవి-సదానందం గౌడ్ గుర్తుచేశారు. వరుస ఘటనలతో కాలనీవాసులు, మహిళలు, వృద్ధుల్లో భయాందోళనలు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని, . లక్ష్మీనగర్ పరిసరాల్లో తెల్లవారుజామున, రాత్రి వేళల్లో బ్లూ కోల్ట్స్‌తో పాటు పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచి ప్రజలకు భద్రత కల్పించాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరారు.

## ప్రియుడి సహకారంతో కూతురు హత్యకు తండ్రి కుట్ర




**ఎల్కతుర్తి ఆగస్టు 24 పీపుల్స్ డైరి :** వివాహితను హత్య చేసి ఖననం చేసేందుకు కారులో తీసుకొచ్చి పోలీసులకు దొరికిన సంఘటన తెలిసిందే. ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన ఎడెల్లి వినోద్ కుమార్ ను వివాహిత హత్య కేసులో అరెస్టు చేసినట్టు కాజీపేట ఏసీబీ పింగిలి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎల్కతుర్తి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. వినోద్ కుమార్ బీటెక్ పూర్తి చేసి కొంతకాలంగా కరీంనగర్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నాడు. చిన్ననాటి స్నేహితులైన మానస గతంలో రెండు పెళ్లిళ్లు చేసుకుని జులాయిగా తిరుగుతూ వినోద్ కుమార్ తో వివాహేతర సంబంధం ఏర్పరచుకొని సహజీవనం చేస్తున్నారు. మానస ప్రవర్తన తో విసుగు చెందిన తండ్రి అంకతి రాజేశం తన కూతురును ఏదో ఒకటి చేయాలని వినోద్ కుమార్ కు చెప్పడంతో వివాహం చేసుకోవాలని వినోద్ కుమార్ ను ఒత్తిడి చేసే క్రమంలో మానసను గొంతు పిసికి చంపినట్టు నిందితుడు ఒప్పుకున్నాడని తెలిపారు. వివాహితను హత్య చేసిన నిందితున్ని ఎడెల్లి వినోద్ కుమార్ ను ఎల్కతుర్తి సమీపంలోని నాగార్జున సీడ్ ప్లాంట్ వద్ద అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు ఏసిపి ప్రశాంత్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో సీఐ పులి రమేష్ ఎస్సై నరసింహారావు కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి, అఖిల్, బక్కయ్య, సుమన్, నిరంజన్, మోహన్ బాబు, రామ్ లాల్, పాల్గొన్నారు.

## ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి

**హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) ఆగస్టు 24 :** హుస్నాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, పనుల నాణ్యత, వేగం, నిర్మాణ ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న 250 పడకల ఆసుపత్రి భవనం పూర్తయితే ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు మరింత చేరువ కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిర్మాణ పనుల సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసిన మంత్రి, ఆసుపత్రి భవన నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## చినుకు పడితే చిత్తడే..

**పెద్దశీపల్లి నుండి దుంపిల్లపల్లి వరకు బురదమయంగా మారిన రోడ్డు**



**రేగొండ, ఆగస్టు 24 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దశీపల్లి నుండి దుంపిల్లపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారి బురధమయంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది, రోడ్డు బురదమయంగా ఉండడంతో రెండు గ్రామలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెద్దశీపల్లి నుండి దుంపి ల్లపల్లి కి వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే మరమ్మతులు నిర్మించి లేదా బీటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని రెండు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అధికారులు, స్థానిక నాయకులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు వేడుకుంటున్నారు.

## డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

- **జమ్మికుంట పట్టణ పరిధిలోని కస్తూరిబా పాఠశాల సమీపంలో గల డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మరియు కౌన్సిలర్లు..**



**జమ్మికుంట అగస్ట్ 24పీపుల్స్ డైరీ :** పట్టణ ప్రజలందరికీ కూడా నమస్కారం ఈరోజు 2దీఎఖ ని కేశవపురం కస్తూరిబా స్కూల్ దగ్గర ఉన్నటువంటి కొన్ని ఇండ్లను పరిశీలించడానికి రావడం జరిగింది. ఎందుకంటే ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పంపిణీలో లబ్ధిదారులందరినీ కూడా సెలెక్ట్ చేసే పరిస్థితి ఉంది ప్రజలందరు కూడా అక్కడ ఇండ్లన్ని పూర్తి అయిపోయినాయి మాకు మంజూరు చేసినటువంటి పత్రాలు ఇస్తే దానిలో పోయి నివాసంగా ఉండొచ్చు అని అనుకుంటున్నారు ఈరోజు జమ్మికుంటకు మొత్తం కూడా 500 డబుల్ బెడ్‌రూమ్‌లు అప్పుడు ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వమే ఇది నిర్మాణం మొదలుపెట్టి పూర్తి అయ్యే దశలో ప్రభుత్వము మారడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ కొద్దిరోజులకే గత ప్రభుత్వం చేసినటువంటి తప్పులను గాని మేము ఏం చేయము మీకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వలేదు అని చెప్పి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఈరోజు ప్రభుత్వానికి జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ తరపున ఒక విజ్ఞప్తి, ప్రజలను ఎవరినీ కూడా ఎవరూ మోసం చేయొద్దు ఏ ప్రభుత్వం అయినా కూడా ప్రజలకి మెరుగైన సదుపాయాలు ఉండడానికి ఒక మంచి ఇల్లు అనే ఒక పథకాన్ని తీసుకొచ్చినటువంటి ఏ ప్రభుత్వానైనా ప్రజలు ఆదరిస్తారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వం ప్రారంభించినటువంటి 2BHK ని ఈరోజు పంచడానికి హడావుడి మేము గెలిచి ఇప్పుడు ఆరు నెలల కాలం పూర్తౌస్తుంది, ఆరు నెలల నుంచి ఇగో రేపు, ఇగో రేపు, ఇగో రేపు అని చెప్పి వాళ్ళు ప్రచారాలు చేస్తున్నారు నిన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా గౌరవనీయులు గృహనిర్మాణ శాఖ మంత్రి కూడా తప్పకుండా ప్రజలకు మిగిలిన ఏదైతే రిమైనింగ్ వర్క్ అక్కడ పెండింగ్ ఉందో, ఆ యొక్క లబ్ధిదారునికే మేము నగదు ఇచ్చి ఆ కన్‌స్ట్రక్షన్ పూర్తి చేస్తాము ఉదాహరణకి జమ్మికుంటలో 500 ఇండ్లు ఈరోజు ఇక్కడి నుంచి మేము జిల్లా కలెక్టర్ కి మరియు ఇక్కడున్నటువంటి మంత్రులకి, ఇక్కడున్నటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి రాజకీయ విమర్శలు మాకు అవసరం లేదు ఇక్కడున్నటువంటి మీరు ఎవరికైతే లబ్ధిదారులకి ఇస్తా అన్నారో, ఒక్కసారి ఆ లబ్ధిదారులని మీరు మంజూరు చేసిన లబ్ధిదారులను ఒక్కసారి ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లని వాళ్ళనే పరిశీలించమనండి, లేదంటే మీరు కూడా రండి లేదు ఇక్కడ ఎంత ఖర్చు అవుతది, ఎంత నిధులు కేటాయిస్తే ఈరోజు ఈ డబుల్ బెడ్‌రూమ్‌లు అన్నీ పూర్తి కావస్తాయి ఈరోజు ప్రజలకి అబద్ధాలు చెప్పుకుంటూ ప్రజలని ఆశగా ఎదురుచూసే విధంగా ప్రభుత్వాలు చేయొద్దు దయచేసి జిల్లా కలెక్టర్ , స్థానికంగా ఉన్నటువంటి మున్సిపల్ కమిషనర్ ,హౌసింగ్ పీడీ ఎంతసేపూ ఇక్కడ 240 ఇండ్లు ఉన్నాయి అని చెప్పి కస్తూరిబా స్కూల్ దగ్గరనే ఇక్కడ నిర్మాణ దశలో రేపు పొద్దున వచ్చి నివాసయోగ్యంగా ఉండడానికి ఉన్న ఇండ్లు మాత్రము 24 ఇండ్లు మాత్రమే నివాసయోగ్యంగా రేపు పొద్దున వచ్చి ఊడ్చుకొని కిటికీలో దర్వాజాలో పెడితే ఉండొచ్చు మిగతావన్నీ ఒకటేమో ఫౌండేషన్ స్టేజ్‌లో ఉంది, ఒకటేమో పిల్లర్ స్టేజ్‌లో ఉంది, ఒకటేమో G+1 కట్టి G+2 పెండింగ్‌లో ఉన్నది లోపట ఇక్కడున్నటువంటి మెటీరియల్‌ని కన్‌స్ట్రక్షన్ అంతా కూడా గుర్తితెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు అంటే పూర్తిగా కూడా శిథిలంలో అంటే ఇక్కడ ఎవరూ నివసించే పరిస్థితి లాగా కనబడడం లేదు. దయచేసి జిల్లా కలెక్టర్ గారు సంబంధిత అధికారులతో సమాచారం తెలుసుకున్న తర్వాత డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేయగలరని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శీలం శ్రీనివాస్, కొలుగురి సురేష్, ఫిరోజ్, మైస రవి, పరశు రామ్, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు..

## కొడుకుల్లారా..నన్ను ఎట్ల సంప బుద్ధి అయిందిరా..!

- **మూఢనమ్మకంతో కన్నతల్లినే బావిలోకి తోసేశారు!**
- **ఇంట్లో చనిపోతే అరిష్టమని దారుణం**
- **ఐదు నెలల తర్వాత వీడిన వృద్ధురాలి మృతి మిస్టరీ**
- **ఇద్దరు కుమారుల అరెస్టు**



**సైదాపూర్ ఆగస్టు 24 ( పీపుల్స్ డైరీ ) :** ఇంట్లో చనిపోతే ఇల్లు వదలాల్సి వస్తుందనే మూఢనమ్మకంతో కన్నతల్లినే బావిలోకి తోసి హతమార్చిన అమానవీయ ఘటన సైదాపూర్ మండలం ఎలబోతారంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా నమ్మించిన కుమారులే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు తేల్చారు. హుజూరాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్, సైదాపూర్ ఎస్సై స్వాతి తెలిపిన వివరాల ప్రకారం ఎలబోతారం గ్రామానికి చెందిన నూనె వెంకటమ్మ (80) కొంతకాలంగా పక్షవాతంతో మంచానికే పరిమితమైంది. వృద్ధాప్యంతో పాటు తీవ్ర అనారోగ్యంతో ఉన్న తల్లి ఇంట్లో మరణిస్తే వాస్తుదోషం చుట్టుకుంటుందని, ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తుందని ఆమె పెద్ద కుమారుడు సమ్మయ్య, చిన్న కుమా రుడు శ్రీనివాస్ భావించారు. ఈ క్రమంలో గత ఏప్రిల్ 5 2026న రాత్రి సమయంలో తల్లిని సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి అందులోకి తోసేశారు. అనంతరం ఆమెకు కంటిచూపు, మతిస్థిమితం లేకపోవడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయిందంటూ కట్టుకథ అల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగించారు. ఐదు నెలల పాటు సాగిన విచారణలో కుమారుల ప్రవర్తనపై అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు. మూఢనమ్మకంతోనే తల్లిని బావిలోకి తోసి చంపినట్లు ఒప్పుకోవడంతో ఇద్దరు కుమారులపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ రూలర్ సీఐ శ్రీనివాస్, ఎస్సై స్వాతి ఏఎస్సైలు సంపత్ రెడ్డి తిరుపతి కానిస్టేబుల్ రాజు హోంగార్డ్స్ రఫీ తిరుపతి వెల్లడించారు.

## జీవో 97 వెంటనే రద్దు చేయాలి... ఈ శక్తి స్కీమ్ మాకొద్దు

- **జర్మనీ సర్టిఫికెట్లు వద్దు.. జీవో 97 రద్దు చేయాలి: పాలిటెక్నిక్ విద్యార్థులులి**
- **ఏఎమ్మెల్యే కార్యాలయం ముట్టడించిన పాలిటెక్నిక్ విద్యార్థులు**




**మణుగూరు ఆగస్టు 24 ( పీపుల్స్ డైరీ ) :** పాలిటెక్నిక్ విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసే ఈ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలి. విద్యార్థుల భవిష్యత్తును ఏకపక్షంగా చూస్తున్న ఈ ప్రభుత్వం 97 ఈ జీవోను వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పాలిటెక్నిక్ విద్యార్థులు మణుగూరు లోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడికి ప్రయత్నం చేశారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించిన పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలు ఈ శక్తి స్కీమ్ 97జీవోలను తీసుకొని వచ్చి మా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటుందని జర్మనీలోని మహేంద్ర ప్రైవేట్ సంస్థలకు మా విద్యార్థులు తాకట్టు పెడుతున్నారు మమ్ములను తాకట్టు పెట్టి ఆర్థికంగా సొమ్ము చేసుకుం టున్నారు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జర్మనీ సర్టిఫికెట్లు ఇంటర్నేషనల్ సర్టిఫికెట్లు మాకు వద్దు మా పాలిటెక్నిక్ లోని ఇంటర్నేషనల్ లాంగ్వేజ్ ని పెడితే మా భవిష్యత్తు ఇంకా మెరుగ్గా ఉంటుంది కానీ వాటిని బంద్ చేసి తెలిసి తెలియక ఇష్టం వచ్చింనిర్ణయాలతో మా విద్యార్థుల భవిష్యత్తు ని తాకట్టు పెడుతున్నారని ఎవరి స్వలాభం కోసం జీవో 97 తీసుకొచ్చారు ఈ శక్తి స్కీమ్ ఎవరికోసం విద్యార్థులకు పనికిరానిదే ప్రభుత్వానికి ఎలా పనికొస్తుంది వెంటనే ఈ జీవన రద్దు చేయాలి లేకుంటే ఇలానే ఇది కొనసాగితే రానున్న రోజుల్లో ప్రతి ప్రభుత్వ కార్యాలయం అసెంబ్లీ ముట్టడికి కూడా ప్రయత్నిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు.

## నకిలీ ఆర్ఓఆర్ సర్టిఫికెట్లపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

- **కోరపల్లి భూ వివాదంలో కలెక్టర్‌కు బోయిని లావణ్య ఫిర్యాదు..**

**జమ్మికుంట ఆగస్టు 24పీపుల్స్ డైరీ :** కోరపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో నకిలీ ఆర్.ఓ.ఆర్./703/2011, 13(బి), 13(సి) సర్టిఫికెట్లు సృష్టించడంతో పాటు రెవెన్యూ రికార్డుల్లో ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వెంకటేశ్వరపల్లికి చెందిన బోయిని లావణ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోరపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 553/ఎలో 4-32 గుంటల భూమిని తాను కొనుగోలు చేశానని, తన పేరుపై మ్యూటేషన్ కోసం ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ దరఖాస్తు పెండింగ్‌లో ఉందని లావణ్య పేర్కొన్నారు. ఇదే భూమిని మరికొందరు రైతుల భూములతో కలిపి కాజేయాలనే ఉద్దేశంతో గిరబోయిన శ్రీనివాస్, గిరబోయిన కొమురయ్య పేర్లతో నకిలీ ఆర్.ఓ.ఆర్. డాక్యుమెంట్లు సృష్టించారని ఆమె ఆరోపించారు. ఆర్.ఓ.ఆర్./703/2011, 13(బి), 13(సి)కు సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా, జమ్మికుంట తహశీల్దార్ కార్యాలయం నుంచి అందిన సమాచారంలో పలు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయని లావణ్య తెలిపారు. ముఖ్యంగా 2011 సెప్టెంబర్ 5న జారీ అయినట్లు పేర్కొంటున్న పత్రంపై సంతకం చేసిన తహశీల్దార్ కె. భాస్కర్‌రావు ఆ సమయంలో జమ్మికుంట తహశీల్దార్‌గా పనిచేయలేదని, ఆ కాలంలో జి. శంకరయ్య తహశీల్దార్‌గా విధులు నిర్వహించినట్లు రికార్డుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. అలాగే కోరపల్లి గ్రామ పహాణీ, 1-బి రికార్డుల్లో మార్పులు, చేర్పులు జరిగినట్లు అనుమానాలున్నాయని, సంబంధిత అసలు రికార్డులను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని కలెక్టర్‌ను కోరారు. గతంలో కూడా ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమగ్రంగా విచారణ జరగలేదని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం, తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. హైకోర్టు పరిణామాల నేపథ్యంలో జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో గిరబోయిన శ్రీనివాస్, గిరబోయిన కొమురయ్య తదితరులపై ఎఫ్ఐఆర్ నెం. 299/2026, తేదీ 22-07-2026న కేసు నమోదు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నకిలీ ఆర్.ఓ.ఆర్. పత్రాలను రద్దు చేసి, రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను సరిచేయడంతో పాటు ట్యాంపరింగ్‌కు పాల్పడిన ప్రభుత్వ, శాఖాపరమైన బాధ్యులపై కూడా క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బోయిని లావణ్య కలెక్టర్‌ను కోరారు. ఈ ఫిర్యాదు ప్రతులను కరీంనగర్ పోలీస్ కమిషనర్, హుజూరాబాద్ ఆర్డీవో, ఏసీపీ, జమ్మికుంట తహశీల్దార్, జమ్మికుంట టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లకు అందజేశారు.



# సింగరేణి మండలానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలి

- **సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు డిమాండ్**

**సింగరేణి,(కారేపల్లి) ఆగస్టు 24: (పీపుల్స్ డైరీ) :** స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తయినా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం దాటినా ఏజెన్సీ ప్రాంతంలోని సింగరేణి మండలానికి ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీరు అందని పరిస్థితి నెలకొందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సింగరేణి మండలానికి సాగు, తాగునీరు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి సీపీఎం సీనియర్ నాయకులు, బాజుమల్లాయిగూడెం మాజీ సర్పంచ్ అమరజీవి కామ్రేడ్ కరపటి రాములు 13వ వర్ధంతి సభ వజ్జా రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి మండలంలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర పేద రైతులకు వర్షపు నీరు, ఆ నీటితో నిండే చెరువులు, కుంటలు, బోర్లు, బావులు మినహా శాశ్వత నీటి వనరులు లేవన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి మండలం పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు కాలువల కోసం సింగరేణి మండలంలోని మధ్యతరగతి, పేద రైతుల భూములను తీసుకుంటున్నప్పటికీ, 2013 భూ నిర్వాసితుల చట్టాన్ని అమలు చేసే విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్టు కాలువలు సింగరేణి మండలం మీదుగా వెళ్తున్నప్పటికీ, ఇక్కడి భూములకు మాత్రం చుక్క నీరు అందడం లేదని అన్నారు. గుట్టలను దాటకుండా కాలువల ద్వారా నీటిని ఎలా తరలిస్తున్నారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారు అనే విషయాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతుల ప్రాంతానికే సాగునీరు అందకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రజా సమస్యలపై పోరాటమే నిజమైన నివాళి. సింగరేణి మండల ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నున్న నాగేశ్వరరావు కోరారు. ప్రజా ప్రతినిధిగా, కమ్యూనిస్టు




నాయకుడిగా కరపటి రాములు అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడి, ప్రజలకు పలు సౌకర్యాలు కల్పించడంలో ముందుండి ప్రజల మనసుల్లో నిలిచారని కొనియాడారు .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను కొనసాగిం చడమే కరపటి రాములుకు ఇచ్చే నిజమైన నివాళి అని నున్న నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమం లో పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్య నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, మండల కమిటీ సభ్యులు సురభాక ధనమ్మ, యనగండ్ల రవిబాబు, శాఖ కార్యదర్శి సూరబాక సర్వయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, పార్టీ సభ్యులు షేర్ వెంకటేశ్వర్లు, బచ్చల బుజ్జమ్మ, బచ్చల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కరపటి రంబాయమ్మ, భారత లక్ష్మి, బజ్జల వంశీకృష్ణ, ధరావత్ సరిత, కరపటి రాములు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్టులు చేస్తారా..

- **ముందస్తు అరెస్టులపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆగ్రహం**

**చిగురుమామిడి,ఆగస్టు24 (పీపుల్స్ డైరీ):** రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనను పురస్కరించుకుని చిగురుమామిడి మండలంలో బీఆర్ఎస్ నాయకులను,కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడంపై బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కాలరాస్తోందని మండిపడ్డారు. మంత్రి పర్యటన వస్తే ప్రతిపక్ష నాయకులను గృహనిర్బంధాలు చేయడం, పోలీస్ స్టేషన్లకు తరలించడం వంటి అణచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడ నిలదీస్తారోననే భయంతోనే ఇష్టారాజ్యంగా ముందస్తు అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. అరెస్టులతో ప్రజా గొంతుకలను, పార్టీ శ్రేణుల ఉద్యమాలను నొక్కలేరని మామిడి అంజయ్య హెచ్చరించారు. తక్షణమే అరెస్ట్ చేసిన నాయకులను, మాజీ సర్పంచ్ బోయిని శ్రీనివాస్ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి చింతపుల తిరుపతి గుంటి క్రాంతి కుమార్,కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని అడిగిన రైతులను అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రచార



కార్యదర్శి బెజ్జంకి రాంబాబు మాజీ సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు నాగేల్లి రాజిరెడ్డి రాజేందర్ రెడ్డి నిలిగొండ దశరథం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. భారత రాష్ట్ర సమితి మండల పార్టీ అధ్యక్షులు మామిడి అంజయ్య

# ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి

- **16 గ్రామాల్లో 46 మందికి రూ.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వొడితల ప్రణవ్ నేరుగా వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు**

**హుజురాబాద్, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం నిర్వహించిన “మన ఊరు--మన కాంగ్రెస్--మన ప్రణవ్” కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ మండలంలోని 16 గ్రామాల్లో పర్యటించిన ఆయన, మొత్తం 46 మంది లబ్ధిదారులకు రూ.16 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, ఆపద సమయంలో తమకు ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు కోసం మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. గ్రామాల్లో పర్యటించే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ప్రణవ్, నూతనంగా నిర్మించిన ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, జిల్లా అధికార ప్రతినిధులు,



హుజురాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొలుగూరి కిరణ్, సింగిల్ విండో చైర్మన్ సుగుణాకర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బురదమయమైన రోడ్డుపై ..నాట్లు వేసి గ్రామ ప్రజల నిరసన

- **గుంతలు, బురదతో అధ్వానంగా మారిన ప్రధాన రహదారి..**
- **అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**

**రేగొండ ఆగస్టు 24 పీపుల్స్ డైరీ..** కొత్తపల్లి గోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో ప్రధాన రహదారి గుంతలు, బురదతో అధ్వానంగా మారడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డుపై నీరు నిలిచి గుంతలు కనిపించకుండా పోవడంతో వాహనదారులు, పాద చారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు దుస్థితిపై ఎన్నిసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వారు తెలిపారు. దీంతో తమ నిరసనను వినూత్నంగా తెలియజేస్తూ బురదమయమైన రోడ్డుపైనే నాట్లు వేసి నిరసన చేపట్టారు. గుంతల్లో నీరు, బురద పేరుకుపోవడంతో రహదారి వ్యవసాయ పొలాన్ని తలపిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి మీదుగా ప్రతిరోజూ విద్యార్థులు, రైతులు, కూలీలు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగిస్తుంటారని, గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా మారి అత్యవసర సమయాల్లో కూడా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదు-రవుతున్నాయని పేర్కొన్నారు. వెంకటేశ్వర్లపల్లి గ్రామ ప్రజల సమస్యను అధికారులు వెంటనే గుర్తించి రహదారిని పరిశీలించాలని, గుంతలను పూడ్చడంతో పాటు శాశ్వతంగా నాణ్యమైన రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి**

**సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 24 :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజలు ప్రజావాణికి వచ్చి దరఖాస్తులు అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 90 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ,



ఎస్‌డీసీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి-ఎంపిడివో వెంకటేశ్వరరావు




**రేగొండ ,ఆగస్టు 24 పీపుల్స్ డైరీ..** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీడీవో. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం రేగొండ రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోనీ వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు, ప్రజావాణి కార్యక్రమానికి ఏడు దరఖాస్తులు వచ్చినట్లు వీటిని ఆన్లైన్ ద్వారా కలెక్టర్ కార్యాలయానికి పంపించిహాసమస్యలు పరిష్కరిస్తామని, గత వారం ప్రజావాణిలో వచ్చిన పది దరఖాస్తుల ద్వారా వచ్చిన సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో. పెద్ది వాసుదేవరెడ్డి, మెడికల్ ఆఫీసర్. హిమబిందు, నాయబ్ తహసీల్దార్ ఎండి. అబ్దుల్ రజాక్, ఆయా శాఖల అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భూముల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలి

**జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం**



**భూపాలపల్లి ఆగస్ట్ 24 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలు, అక్రమ చేర్పులపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందుపట్ల కీర్తి రెడ్డి, మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లాలో 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలు, అక్రమ చేర్పుల వల్ల అనేక మంది రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏళ్ల తరబడి తమ భూములపై హక్కులు ఉన్నప్పటికీ 22(ఎ) జాబితాలో చేర్చడం వల్ల వాటిని విక్రయించలేక, అభివృద్ధి చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 22(ఎ) జాబితాలో జరిగిన చేర్పులు, తొలగింపులపై సమగ్ర విచారణ జరిపి, గ్రామం, మండలం, సర్వే నంబర్ వారీగా పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరణి, భూ భారతి తదితర డిజిటల్ భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని కోరారు. అర్హత లేని భూములను 22(ఎ) జాబితాలో చేర్చినట్లయితే వాటిని వెంటనే గుర్తించి తొలగించాలని, బాధిత రైతులకు న్యాయం చేయాలని కీర్తి రెడ్డి, డిమాండ్ చేశారు. భూముల సమస్యను పరిష్కరించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు. 22(ఎ) భూముల వ్యవహారంలో అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల భూములపై ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, భూ హక్కులను కాపాడాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు :** భూపాలపల్లి జిల్లాలోని 22(ఎ) భూముల పూర్తి జాబితాను బహిర్గతం చేయాలి. గ్రామం--మండలం--సర్వే నంబర్ వారీగా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. 22(ఎ)లో జరిగిన చేర్పులు, తొలగింపులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలి. డిజిటల్ భూ రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలి. తప్పుగా చేర్చిన భూములను గుర్తించి వెంటనే తొలగించాలి. బాధిత రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలి. అక్రమాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. 22(ఎ) వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపించాలి. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు నాలుగో వార్డ్ కౌన్సిలర్ కన్నం యుగంధర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు జన్నే మొగిలి ఎరుకల గణపతి జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్ తాడికొండ రవి కిరణ్ పెండ్యాల రాజు మరియు రాష్ట్ర జిల్లా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రేగొండ పోలీస్‌స్టేషన్‌లో హరితహారం..

**వెదురు టేకు మొక్కలు నాటిన ఎస్సై సుధాకర్..**



**రేగొండ ఆగస్టు 24 పీపుల్స్ డైరీ ..** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా రేగొండ పోలీసుస్టేషన్ పరిసరాలలో సిబ్బందితో కలిసి మొక్కలను ఎస్ఐ సుధాకర్ నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు నాటిన మొక్కను రక్షించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
మంగళవారం, 25 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 163




## దేవకన్యలా మెరిసిన మానస వారణాసి

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా 2020 విజేత గా నిలిచారు. 'దేవకీ నందన వాసుదేవ' తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఇప్పుడు తన ట్రెడిషనల్ గ్రేస్‌తో కుర్రకారు గుండెలను కొల్లగొడుతోంది. హైదరాబాద్‌కే చెందిన ఈ ముద్దుగుమ్మ మిస్ వరల్డ్ 2021 పోటీల్లో టాప్-13లో నిలిచి దేశం గర్వపడేలా చేసింది. రీసెంట్‌గా రిలీజైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి హిట్ కొట్టిన ఈ అందాల భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధులను చేస్తోంది. మానస వారణాసి "బ్రషెడ్ బై ది బ్రియాజ్ "అంటూ ఇన్స్టాగ్రామ్‌లో పంచుకున్న పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లైట్‌వెయిట్, పారదర్శకమైన శారీ డ్రేప్‌లో ఆమె కనిపించిన తీరు దేవకన్యను తలపిస్తోంది. ఇక ప్లెయిన్ వైట్ స్లీవ్‌లెస్, హై-నెక్ బ్లౌజ్‌తో రూపొందించిన ఈ మోడరన్ అండ్ ట్రెడిషనల్ కాంబినేషన్ ఆమెకు ఎంతో క్లాసీ అండ్ ఫ్రెష్ లుక్‌ని ఇచ్చింది. ఎక్కువ హడావుడి లేకుండా మినిమల్ టచ్‌తో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయబద్ధమైన సిల్వర్ ఝుంకాలు, చేతికి ఒక సన్నటి బ్రాస్‌లెట్ మాత్రమే ధరించి తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఇక కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు "ఏంజెల్", "అచ్చ తెలుగు అందం", "సూపర్బ్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ లైకుల సునామీ సృష్టిస్తున్నారు.




## 80 కోట్ల మార్క్ దాటిన ఇరుముడి

రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా రికార్డులు సృష్టిస్తోంది. తమిళంలో ఈ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణం ఈ నగరంలోనే ప్రారంభమైందని తెలిపారు. 'ఇరుముడి'కి జీవీ ప్రకాశ్ హృదయంతో సమానం. ఎడిట్ రూమ్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (నేపథ్య సంగీతం) లేకుండా చూసినప్పుడే.. ఇది విజయం సాధిస్తుందని అర్థమైంది. ÷-లకైమాక్స్ చూసిన తర్వాత థియేటర్‌లలో మగవారితో పాటు చిన్న పిల్లలు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఆ దృశ్యాలు నిజంగా హృదయాన్ని హత్తుకుంటున్నాయి' అని రవితేజ అన్నారు. ప్రియా భవానీ శంకర్ గొప్ప నటి అని ప్రశంసించారు. ఈ సినిమా తెలుగులో విజయం సాధించినట్లే.. తమిళంలోనూ కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.'ఇరుముడి' చిత్రానికి ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన వస్తోంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌లో చేరిన రవితేజ మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఇక మూడు రోజుల్లోనే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది.



## విడుదలకు ముందే టాక్సిస్ రికార్డులు

యశ్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆగస్టు 21న ప్రారంభమైన బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో.. విడుదలకు ముందే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తాజా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు కోసం భారత్‌లో డైరెక్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.21.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇప్పటి వరకు 13,591 షోలకు గాను దాదాపు 5.55 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హోల్డ్‌లో ఉంచిన సీట్లతో కలిపి చూస్తే ఈ మొత్తం ఏకంగా రూ.30.14 కోట్లు దాటాయని ట్రేడ్ వర్గాల చెబుతున్నాయి. ముఖ్యంగా హోమ్ స్టేట్ కర్ణాటకలో ఈ సినిమా బుకింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతు న్నాయి. అక్కడ ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా వసూళ్లు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి. పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'టాక్సిక్' మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో ఇప్పటికే రూ. 7.35 కోట్లకు పైగా బుకింగ్స్ జరగగా, నార్త్ అమెరికా (యూఎస్) ప్రీమియర్ బుకింగ్స్ ద్వారా 1.63 లక్షల డాలర్ల (రూ.1.56కోట్లు) వసూళ్లు వచ్చాయి. విదేశాల్లో ఈ సినిమా 260 లొకేషన్లలో, 709 ప్రాంతాల్లో రిలీజ్‌కానుంది.




## రాకాలో ఐశ్వర్యలక్ష్మి

### నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది.

## రైతు పక్షపాతి సారంపల్లి మృతి తీరని లోటు

### వరంగల్ ఛాంబర్ ఆఫ్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి

**మట్టెవాడ, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ):** సిపిఎం సీనియర్ నాయకులు, అఖిల భారత రైతు సంఘం నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలం నుండి నేటి వరకు రైతాంగ సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల సాధన, పండించిన పంటలకు మద్దతు ధరల కోసం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ మల్లారెడ్డి అని అన్నారు. ?రైతుల హక్కుల కోసం, సాగునీరు, ప్రజల సమస్యలపై ఎన్నో మహత్తర ఉద్యమాలను నిర్మించి, నడిపిన గొప్ప ఉద్యమ నాయకుడు ఆయన. ఉమ్మడి రాష్ట్రంలో రైతాంగ సమస్యలపై ఆయన చేసిన సుదీర్ఘ పోరాటాలు ప్రజా ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. మల్లారెడ్డి మరణం రైతాంగానికి, కార్మిక వర్గానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు బొమ్మినేని హృదయపూర్వక సానుభూతిని తెలియచేశారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్



**మట్టెవాడ, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సోమవారం మట్టెవాడ ప్రభుత్వఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భోజన తయారీ, వడ్డింపు ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం విషయంలో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సత్యశారద తెలిపారు.

## ప్రభుత్వ కళాశాలల్లో షూ, బ్యాగుల పంపిణీ

### ఇంటర్ విద్యార్థులకు మెరుగవుతున్న సదుపాయాలు - డిఐఈఓ డాక్టర్ జి.శ్రీధర్ సుమన్



**మట్టెవాడ, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ):** వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ విద్యార్థులకు షూ, బ్యాగులు పంపిణీ చేయబడినట్లు వరంగల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ వెల్లడించారు. సోమవారం కృష్ణాకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఉచిత షూ, బ్యాగులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఐఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఈ విద్యా సంవత్సరం అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అనూహ్యమైన సౌలభ్యాలు అందుబాటులోకి వస్తున్నాయని, ఉచిత నోట్ బుక్స్ తో పాటు బ్యాగ్స్, షూస్ తదితర అన్ని సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ షూ, బ్యాగులు ఇవ్వడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు భారం తగ్గనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని అందులో మొత్తం 2,704 విద్యార్థుల్లో 1,562 మంది బాలురు, 1,142 మంది బాలికలు ఉన్నారని వారందరికీ త్వరలో యూనిఫాం కూడా అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, లైబ్రేరియన్ వనమాల, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిపి కార్యదర్శులపై ప్రజావాణిలో ఫిర్యాదు

### ఆర్టిఐ నేత చర్లపల్లి వెంకటేశ్వర్ గౌడ్



**మొగుళ్ళపల్లి, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించడం లేద ని ప్రజావాణి ద్వారా ఆర్టిఐ నేత చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ఫిర్యా దు చేశారు. కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ప్రజలకు అందుబాటులో ఉండాలని సమాచార హక్కు చట్టం వచ్చి 20 సంవత్సరాలు గడుస్తున్న ప్రభుత్వ కార్యాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయడం లేదని చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ప్రజావాణిలో మండల నోడల్ అధికారి సురేందర్ కు ఫిర్యాదు చేశారు,

## పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా ఆకుల సుభాష్ ముదిరాజ్ ఎన్నిక



**గణపురం, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఆకుల రాజయ్య ఆధ్వర్యంలో ముదిరాజ్ కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడిగా ఆకుల సుభాష్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా సాధు కరుణాకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల కృష్ణస్వామి ముదిరాజ్, సహాయ కార్యదర్శిగా ఆకుల రాజ్‌కుమార్ ముదిరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఆకుల రాజయ్య ముదిరాజ్, ఆకుల సదానందం ముదిరాజ్, మాల సాంబయ్య ముదిరాజ్, ఊరడి రాజయ్య ముదిరాజ్, ఆకుల శ్రీనివాస్ (చింటూ) ముదిరాజ్, ఆకుల సంపత్ ముదిరాజ్, ఆకుల రమేష్ ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. ముదిరాజ్ కులస్తులంతా ఐకమత్యంతో ముందుకు సాగుతూ పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



# ప్రజావాణి దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి!

### బల్దియా కమిషనర్ వెంకన్న



**మట్టెవాడ, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ):** ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం గత వారం ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిగతులను విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా, నిర్దేశిత గడువులో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 72 దరఖాస్తులు స్వీకరించారు. వాటిలో టౌన్ ప్లానింగ్: 30, ఇంజినీరింగ్: 15, హెల్త్ అండ్ శానిటేషన్: 05, రెవెన్యూ: 14, నీటి సరఫరా: 07, హార్టికల్చర్: 01 కలిపి మొత్తం 72 దరఖాస్తులు అందాయి. అనంతరం అధికారులతో కమిషనర్ పన్నుల వసూళ్లపై సమీక్షిస్తూ పన్నుల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్దేశించిన పన్ను వసూలు లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రతి మూడేళ్లకు సెప్టిక్ ట్యాంకుల శుభ్రత:** నగర పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా సెప్టిక్ ట్యాంకుల శుభ్రతపై అధికారులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. నగరంలోని అమ్మవారిపేటలో ఇటీవల 150 కేఎల్‌డీ సామర్థ్యంతో సెప్టిక్ ట్యాంక్ మలవ్యర్థాల శుద్ధి ప్లాంట్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకోవాలని, నగరంలో నివసించే బల్దియా అధికారులు తమ గృహాల్లోని సెప్టిక్ ట్యాంకులను కూడా నిర్ణీత వ్యవధిలో శుభ్రం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమా ర్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రెటరీ అనిల్ బాబు, పన్నుల అ ధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత కీలకం!



**మట్టెవాడ, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కేయూ పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఇంట్లోనే కాకుండా పాఠశాలలో కూడా ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. పిల్లలకు చిన్ననాటి నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, మంచి చెడుల మధ్య తేడా తదితర విషయాలను తల్లిదండ్రులు బోధించాలన్నారు. పిల్లల స్నేహ సంబంధాలను కూడా తల్లిదండ్రులు గమనిస్తూ, వారి భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి స్నేహాలను ప్రోత్సహించాలని తెలిపారు, పిల్లలతో తల్లిదండ్రులు సమయం గడపాలని, పిల్లలకు నిత్యం మొబైల్ ఫోన్లు ఇవ్వకుండా, వాటి వినియోగంపై తల్లిదండ్రులు నియంత్రణ పాటించాలని సూచించారు. అదేవిధంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరించే తెలియని వ్యక్తులు కనిపించినప్పుడు వారి వద్దకు వెళ్లకుండా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థుల భద్రతలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం సమన్వయంతో పని చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు వరంగల్ మండల పరశురాములు, ఉపాధ్యాయులు వెంకన్న, లక్ష్మీపతి, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం...

### టీజీబీ మినీ బ్యాంక్‌లో సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్ఐ




**దుగ్గొండి, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి, మండలం మందపల్లి గ్రామంలోని టీజీబీ- ఐరిక్స్ మినీ బ్యాంక్ లో సీసీ కెమెరాలను బిగించడం ఎంతో క్షేమమైనదని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఎస్ఐ రావుల రణదీర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మందపల్లి గ్రామం టీజీబీ-ఐరిక్స్ మినీ బ్యాంక్‌కు బ్యాంక్ మిత్ర రైతు సౌందర్య ఆధ్వర్యంలో ఎస్ఐ రావుల రణదీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మినీ బ్యాంక్ లో నిర్మించడం సీసీ కెమెరాలను ఎస్ఐ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను తెప్పించి, తన మినీ బ్యాంక్ లో నిర్మించిన టీజీబీ-ఐరిక్స్ మినీ బ్యాంక్ మిత్ర రౌతు సౌందర్య ఎంతో ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామంలో మినీ బ్యాంక్ సౌకర్యం ఉండడం గ్రామస్తులందరికి ఎంతో మేలైందని ఎస్ఐ అన్నారు. బ్యాంక్ నుండి ఫోన్ చేస్తున్నాము మీ ఆధార్ కార్డ్ నెంబర్, మీ అకౌంట్ నెంబర్ చెప్పమని ఖాతాదారునికి ఫోన్ చేసినట్లయితే అది సైబర్ కాల్ కు చెందినదని ఖాతాదారుడు నిర్ధారించుకోవాలన్నారు. బ్యాంక్ ఖాతాదారునికి సంబంధించిన ఆధార్ నెంబర్, వ్యక్తిగత వివరాల గూర్చి తెలుసుకునేలా బ్యాంక్ నుండి ఎట్టి కోశాన ఫోన్ రాదని ఎస్ఐ తెలిపారు. బ్యాంక్ ట్రాన్సాక్షన్స్ గూర్చేగాని, తెలియని ఫోన్ నెంబర్లద్వార మీ ఆధార్ నెంబర్ చెప్పమని ఫోన్ వచ్చినా గాని, మీ గ్రామంలోని మినీ బ్యాంక్ మిత్రను కలిసి మీ సందేహాలను నివృత్తం చేసుకోవాలని ఎస్ఐ రణదీర్ రెడ్డి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. వీలైతే గ్రామపంచాయతీ నిధులనుండేగాని దాతల సహకారంతో గాని సీసీ కెమెరాలను తెప్పించేలా సర్పంచ్ శ్రద్ధ చూపాలన్నారు. సీసీ కెమెరాలను గ్రామ కూడల్లలో నిర్మించినట్లయితే గ్రామంలో ఎలాంటి దొంగతనాలకు, నేరాలకు తావుండదని, ఒకవేల, అలాంటి సంఘటనలు జరిగిన, సీసీ కెమెరాల ద్వారా అట్టి వ్యక్తులను త్వరగా గుర్తించి చట్టపరంగా శిక్షించవచ్చు అన్నారు. కార్యక్రమంలో టీజీబీ బ్యాంక్ మేనేజర్ జె. సిద్దార్థ, ఫీల్డ్ ఆఫీసర్ చిన్న నాయుడు, సర్పంచ్ మారేడుగొండ శ్రీమాలత రాజేశ్వర చారి, ఉపసర్పంచ్ రాంపాక భాస్కర్, గ్రామ కార్యదర్శి రవి గొల్ల, కారోబారి వాడికారి బాబురావ్, బ్యాంక్ ఖాతాదారులు రేవూరి లింగరెడ్డి, పడిదం మల్లయ్య, లింగాల బుచ్చయ్య, రంగు పూలమ్మ, మాడిశెట్టి, వెంకటయ్య, మాడిశెట్టి చంద్రమౌళి, అంబరగొండ జనార్ధన్, పాల్గొన్నారు.

## మూడవ లయన్స్ క్వెస్ట్ శిక్షణ శిబిరం విజయవంతం



**నర్సంపేట, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మండలం లక్నేపల్లిలోని శివాని హైస్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన మూడవ లయన్స్ క్వెస్ట్ శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణ శిబిరాన్ని లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా , ఐ పి డి జి లయన్ కె. వెంకటరెడ్డి , మల్టిపుల్ కౌన్సిల్ చైర్పర్సన్ అండ్ ఐ పి డి జి; లయన్ ఆర్. రమణారెడ్డి , ఎస్ వి డి జి ఘనంగా ప్రారంభించారు. లయన్స్ క్వెస్ట్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ డాక్టర్ శుభాష్ కానుగంటి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. మొదటి రోజు 10 పాఠశాలల నుండి 30 మంది ఉపాధ్యాయులు పాల్గొని లయన్స్ క్వెస్ట్ కార్యక్రమంపై సమగ్ర శిక్షణ పొందారు. రెండవ రోజు జరిగిన ముగింపు కార్యక్రమానికి జోనల్ చైర్మన్ లయన్ సమ్మిరెడ్డి , లయన్ రేణుక (ట్రైనర్), లయన్ మాధవరెడ్డి , లయన్ ఇంద్రసేనారెడ్డి , లయన్ సుబ్బారావు గారు, లయన్ ప్రభాకర్ రెడ్డి తదితర లయన్స్ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ హోస్ట్‌గా వ్యవహరించి, భోజనం, వసతి ఇతర అవసరమైన ఏర్పాట్లలో విశేష సహకారం అందించింది. ఈ శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన లయన్ మాధవరెడ్డి , లయన్ ఇంద్రసేనారెడ్డి , జోనల్ చైర్మన్ లయన్ సమ్మిరెడ్డి , ఇతర లయన్స్ సభ్యులందరికీ అదేవిధంగా శివాని హైస్కూల్ యాజమాన్యం, ఎల్ ఎన్ వి సుబ్బారావు . జి రాహుల్ వర్మ , హెడ్‌మాస్టర్ సురేందర్ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జిల్లా నుండి విచ్చేసి తమ విలువైన సమయాన్ని కేటాయించిన లయన్స్ క్వెస్ట్ అధికారులు, ట్రైనర్లు ప్రతినిధులందరికీ నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అందరి సహకారం, సమన్వయం అంకితభావంతో మూడవ లయన్స్ క్వెస్ట్ శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 29 మందికి జరిమాన

### నలుగురికి జైలుశిక్ష

**మట్టెవాడ, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 33 మంది వ్యక్తులను వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టు 3వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా లేబర్ కాలనీకి చెందిన సైఫొద్దీన్ (30), బైరాన్ పల్లికి చెందిన మార్త రమేష్ (42), మరిపెడకు చెందిన భూక్యా శ్రీను (36)లకు మూడు రోజుల జైలుశిక్ష, అలాగే మహబూబాబాద్‌కు చెందిన బానోతు సాయి వరప్రసాద్ (23)కు రెండు రోజుల జైలుశిక్ష విధించగా హుజురాబాద్ సబ్ జైలుకు పంపి, మిగతా 29 మంది వ్యక్తులకు కోర్టు రూ.25,400 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఐదు గురు వాహనదారులకు కోర్టు రూ.2600 జరిమానా విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.

## ఉద్యోగస్తుల పిల్లలూ ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలి

### టీఆర్‌పీ మండల అధ్యక్షుడు బోనగిరి రాజేష్



**మొగుళ్ళపల్లి ఆగస్టు 24(పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వ ఉద్యోగస్తులు తమ పిల్లలు కూడా ప్రభుత్వ బడులలోనే చదువుకునేలా విశ్వాసం పెరిగేలా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముగ్గులపల్లి మండల అధ్యక్షుడు భువనగిరి రాజేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థకు కేవలం నిధులు కేటాయించడం సరిపోదని, ప్రభుత్వ పాఠశాలలపై పాలకులు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజల్లో విశ్వాసం పెరిగేలా ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివేలా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే, ఆయా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక వసతులు, డిజిటల్ విద్య, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రభుత్వ యంత్రాంగం మరింత బాధ్యతతో దృష్టి సారించే అవకాశం ఉంటుందని. ప్రభుత్వ పాఠశాలలు కేవలం పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల కోసం మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికి నాణ్యమైన విద్య అందించే కేంద్రాలుగా మారాలని రాజేష్ అన్నారు. అన్ని వర్గాల పిల్లలు ఒకే విద్యా వ్యవస్థలో చదివే పరిస్థితి ఏర్పడితే సామాజిక సమానత్వం, సమాన విద్యా అవకాశాలు పెరగడంతో పాటు ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా విధానపరమైన నిర్ణయం తీసుకుని, దాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
మంగళవారం, 25 ఆగస్టు 2026
సంపుటి : 18, సంచిక : 163


## సారూ... మా పైసలు మాకు ఇప్పించండి.

### మాజీ సర్పంచ్ తిప్పారపు యుగేందర్



**మొగుళ్లపల్లి, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని మాజీ సర్పంచ్ సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో. ప్రజావాణి ద్వారా సారూ మా పైసలు మాకు ఇప్పించండి అంటూ.. దరఖాస్తు పెట్టుకున్నాడు. మొగుళ్ళపల్లి మండలం గణేష్ పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తిప్పారపు యుగేందర్ గణేష్ పల్లి గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవనం మంజూరు కాగా అప్పులు చేసి జిపి భవన నిర్మాణం పనులు పూర్తిచేసి 17 జనవరి 2024 గణేష్ పల్లి గ్రామంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా గ్రామపంచాయతీ భవనం ప్రారంభించామని, అప్పటినుండి డబ్బులు వస్తాయని ఆశతో ఎదురు చూస్తుండగా. 1 జూలై 2026న జిపి భవనంకు సంబంధించిన నిధులు జిపి ఖాతాలో పడ్డాయని రెండు సంవత్సరాల ఏడు నెలలుగా ఎదురుచూస్తున్న డబ్బులు. జిపి ఖాతాలో పడిన విషయం తెలుసుకొని స్థానిక సర్పంచ్ లింగంపల్లి పద్మ ను డబ్బులు విడిపించి ఇవ్వాలంటూ తన చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా కూడా కనికరించకుండా డబ్బులు విడిపించి ఇవ్వనంటూ. నీ దిక్కునచోట చెప్పుకోమన్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి ద్వారా డబ్బులు ఇప్పించండి అంటూ ఫిర్యాదు చేసిన గణేష్ పల్లి మాజీ సర్పంచ్ తిప్పారపు యుగేందర్.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం లింగపాలెం ఎస్సి కాలనీ వాసులు గ్రామపంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది కొత్త ఇల్లు నిర్మాణం చేపట్టుట కొరకు గ్రామ పంచాయతీ రోడ్డు ఇరువైపుల డ్రైనేజీ లను పూడ్చివేశారని, డ్రైన్ లో అక్రమంగా బోరు వేసారని, ఈ పరిస్థితులకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం వైఎస్సార్ నగర్ కాలనీ కు చెందిన కాలనీ వాసులు అంబేద్కర్ విగ్రహం ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమించేందుకు ఆగస్టు 23న అర్ధరాత్రి సేవా లాల్ విగ్రహం పెట్టడం జరిగిందని, గొడవలు అయ్యే అవకాశం ఉన్నదని, ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణపు వెంకటేశ్వరరావుకు ఘన నివాళులు



**ఏన్కూరు, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండల టిడిపి సీనియర్ నాయకులు, టిఎల్ పేట గ్రామానికి చెందిన కళ్యాణపు వెంకటేశ్వరరావుకు పలువురు నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం కళ్యాణపు వెంకటేశ్వరరావు దశదిన కార్యక్రమం జరిగింది .ఈ సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు ,బానోత్ చంద్రావతి ,నాయకులు చలపతి ,కేతినేని హరీష్, లింగాల కమల్ రాజ్, జనార్ధన్, శ్రీను ,అశోక్ తదితరులు నివాళులు అర్పించారు.

# హాస్టల్ పనులు వేగవంతం చేయాలి

## సెప్టెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేయాలి - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**గణపురం, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్ శివారులోని మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం నూతనంగా నిర్మిస్తున్న హాస్టల్ భవన నిర్మాణ పనులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. సోమవారం నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన హాస్టల్ లోని గదులు, ఇతర నిర్మాణ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... హాస్టల్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి సెప్టెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. సుమారు 242 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా నిర్మిస్తున్న ఈ భవనాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భవన నిర్మాణం పూర్తయిన అనంతరం హాస్టల్ చుట్టూ ప్రహరీ గోడతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతి వాతావరణం కల్పించేందుకు అవసరమైతే అదనపు నిధులు కేటాయించేందుకు కూడా కృషి చేస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు హాస్టల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.





# నేడు జిల్లాల్లో ప్రత్యేక వనమహోత్సవం

**నిర్దేశించిన లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి**
**మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి**
**ఖమ్మం జిల్లాలో 31.30 లక్షల లక్ష్యానికి గాను 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యం పూర్తి**
**ఆగస్టు 25న మంగళవారం ఖమ్మం జిల్లాలో ఒకే రోజు లక్ష మొక్కలు నాటేలా కార్యాచరణ : మంత్రి కొండా సురేఖ**



**ఖమ్మం, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25న మంగళవారం భారీ స్థాయిలో మొక్కలు నాటే ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల్లో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను, డిఎఫ్ఓ లను ఆదేశించారు. వన మహోత్సవ కార్యక్రమంపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఎఫ్ఓలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ప్రస్తుత సంవత్సరంలో వన మహోత్సవం కార్యక్రమం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. తక్కువ ప్రగతి సాధించిన జిల్లాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను వేగం గా పూర్తి చేయాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 9 శాతం లక్ష్యం మాత్రమే పూర్తయిందని, హెచ్ఎండీఏ, సూర్యాపేట, 3 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, సంగారెడ్డి ప్రాంతాల్లో 50 శాతం కంటే తక్కువ లక్ష్యం పూర్తయిందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో లక్ష్య సాధనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వేగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.

### జిల్లాలో 67 శాతం లక్ష్యం పూర్తి

జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో వన మహోత్సవం క్రింద 31.30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు సుమారు 20.90 లక్షల మొక్కలు నాటి 67 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. మంత్రి సూచనల మేరకు మంగళవారం జిల్లాలో భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 2 లక్షలకు పైగా గుంతలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మంగళవారం ఒకే రోజు 1 లక్ష మొక్కలు నాటేలా లక్ష్యంగా పెట్టుకున్నామని, ఖమ్మం నుంచి వ్యవసాయ శాఖ మంత్రి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మండల, గ్రామ స్థాయిల్లో కూడా ప్రత్యేకంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ... మంగళవారం 1 లక్ష మొక్కలు నాటే లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. మండలాల వారీగా స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాన్ని నిర్వహించాలని డిఎఫ్ఓకు సూచించారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, అన్ని వర్గాల ప్రజలను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఆర్‌డీఓ బి.శిరీష, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలు కొనసాగించాలని బీఆర్ఎస్ ర్యాలీ

**మణుగూరు ఆగస్టు 24 ( పీపుల్స్ డైరీ) :** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మణుగూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గులాబీ జెండాలు, కండువాలతో ర్యాలీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో అండగా నిలుస్తున్నాయని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మం వైద్యరంగంలో నవశకం...

## 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధం.. మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభోత్సవం





**ఖమ్మం, ఆగస్టు 24 (పీపుల్స్ డైరీ) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజారోగ్య చరిత్రలో మరో కీలక అధ్యాయానికి నాంది పలికేందుకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిద్ధమైంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి గడప తొక్కే రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. తీవ్రమైన అనారోగ్యంతో, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకునే రోగులకు సత్వరమే అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఈ సదుపాయం ఎంతో దోహదపడునుంది. ఇది కేవలం ఒక భవన ప్రారంభోత్సవం కాదు... ఖమ్మం జిల్లా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం వేసిన మరో దృఢమైన అడుగుగా వైద్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల వేసిన అడుగులు కృషి నేడు ఫలించింది.

### రూ.23.75 కోట్లతో రూపుదిద్దుకున్న అధునాతన నిర్మాణం...

ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.23.75 కోట్ల భారీ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2023 జూన్ 7న జారీ అయిన జీవో ఆర్‌టీ నంబర్ 311 ద్వారా ఈ అనుమతులు లభించడంతో నిర్మాణ పనులకు వేగం పెరిగింది. రూ.12.66 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ చేపట్టగా, 2.79 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టు ఖరారు కావడం విశేషం. ఇప్పటివరకు నిర్మాణానికి సుమారు రూ.15.27 కోట్లు వెచ్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

### వైద్య పరికరాలకు రూ.8.48 కోట్లు కేటాయింపు..

మంజూరైన మొత్తం నిధుల్లో నిర్మాణ వ్యయం పోను మిగిలిన రూ.8.48 కోట్లను అత్యాధునిక వైద్య పరికరాల సమకూర్పుకు వినియోగించనున్నారు. దీనితో కేవలం భవనం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక సదుపాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా క్రిటికల్ కేర్ చికిత్సలో నాణ్యత మరింత మెరుగుపడనుంది.

### హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం..

ఇప్పటివరకు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న రోగులను మెరుగైన క్రిటికల్ కేర్ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు తరలించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ప్రయాణ సమయం కీలకంగా మారేది. తాజాగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి రానుండటంతో అత్యవసర సమయంలో విలువైన సమయం ఆదా కావడంతో పాటు రోగుల ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఖమ్మం జిల్లావాసులతో పాటు చుట్టుపక్కల మండలాలు, పొరుగు జిల్లాల ప్రజలు కూడా ఈ సదుపాయం ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

### ప్రభుత్వ వైద్యానికి మరింత బలం..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రానుండటం జిల్లా వైద్య రంగానికి ఒక కీలక ముందడుగుగా నిలవనుంది.

### నేడు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం..

సుదీర్ఘ నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసుకున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నేడు లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ అత్యాధునిక వైద్య సదుపాయం ఖమ్మం ప్రభుత్వ వైద్య సేవల చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించనుంది.

### నాలుగంతస్తుల్లో సమగ్ర వైద్య సదుపాయాలు..

నాలుగు అంతస్తుల్లో విశాలంగా నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల అవసరాలకు అనుగుణంగా వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు.
రెండు ఐసీయూ విభాగాల్లో 20 పడకల చొప్పున 40 పడకలు
20 పడకల జనరల్ వార్డు. 5 పడకల డయాలసిస్ వార్డు
గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, తీవ్ర శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల వైఫల్యం తదితర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అవసరమైన క్రిటికల్ కేర్ సేవలను ఒకే చోట అందించే అవకాశం ఏర్పడనుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com